క్లుప్తంగా

ఘనంగా కుంభోత్సవం



హొళగుందలో కుంభోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

హొళగుంద: స్థానిక పెద్దకొండలోని గుహలో వెలసిన మ్యాగల సిద్దప్పకు భక్తులు మంగళవారం కుంభోత్సవం ఘనంగా నిర్వహించారు. సిద్దేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త రాజ పంపన్న గౌడ్ కుటుంబీకుల ఆధ్వర్యంలో ఈ జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు స్థానిక పెద్దబావి వద్ద గంగిపూజ నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. గంగాజలాన్ని నింపిన కుంభాన్ని సిద్దేశ్వర స్వామి ఆలయ పూజారి ఊరేగింపుగా కొండపైకి తీసుకెళ్లారు. అక్కడ స్వామి వారి విరాట్‌మూర్తికి అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణ, భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో ప్రజలు ఆనందంగా ఉండాలని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు.

సమయపాలన పట్టని ఉద్యోగులు



ఉదయం 11 గంటలైనా తెరుచుకోని చెల్లెచెలిమల సచివాలయం

దేవనకొండ: ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థకు కొందరు అధికారులు చెడ్డపేరు తీసుకొస్తున్నారు. సకాలంలో విధులకు రాకుండా ప్రజలకు అందుబాటులో ఉండకుండా ఇష్టానుసారంగా డుమ్మా కొడుతున్నారు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెల్లెచెలిమల గ్రామ సచివాలయం మంగళవారం ఉదయం 11 గంటలైనా తెరుచుకోలేదు. ఈ సచివాలయంలో 9 మంది సిబ్బంది పని చేస్తుండగా ఏ ఒక్క ఉద్యోగి కూడా సమయానికి వచ్చిన దాఖలాలు లేవు. మధ్యాహ్నం 12:30 గంటలకు డిజిటల్ అసిస్టెంట్ సచివాలయానికి వచ్చారు. తర్వాత మిగతా ఉద్యోగులు ఒక్కొక్కరిగా వచ్చారు. ఉద్యోగులు ఇలా ఆలస్యంగా రావడం పరిపాటిగా జరుగుతోందని, దీనిపై ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి పెద్ద పీట



కడమకుంట్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మి

తుగ్గలి: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ అమరనాథరెడ్డి అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను మంగళవారం వారు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా ఎటువంటి సిఫార్సు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, రామాంజినేయులు, బాబునాయక్ పాల్గొన్నారు.

నవధాన్యాల విత్తన కిట్లు పంపిణీ



విత్తన కిట్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు దర్గన్న

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో మంగళవారం పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు ఎంటీ నాగేష్, రాఘవేంద్ర ఆధ్వర్యంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు దర్గన్న, ఎస్కే గిరి రైతులకు కందులు, మినుము, పెసలు, అలసందలు, నువ్వులు, జొన్నలు, సజ్జ విత్తనాల కిట్లను ఉచితంగా అందజేశారు. వారు మాట్లాడుతూ.. వ్యవసాయధికారుల సూచనల మేరకు రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని జొన్నలను రక్షణ పంటగా వేసుకోవాలని కంది, అలసంద, పెసలు, మినుములను అంతర పంటలుగా వేసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే బంతి, అలసంద, కుసుములను ఎర పంటలుగా వేసుకోవాలన్నారు.

యువతి అదృశ్యం



అదృశ్యమైన ఉషశ్రీ (ఫైల్)

వెల్దుర్తి: మండల పరిధిలోని చెరుకులపాడు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి (జీఎంఎస్‌కే) ఉషశ్రీ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆమె తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కర్నూలులో నివాసముంటున్న ఉషశ్రీ ప్రతిరోజులాగే సోమవారం విధి నిర్వహణకు బయలుదేరింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెంది కుటుంబసభ్యులు పలు చోట్ల వాకబు చేశారు. మంగళవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జ్వరాలతో జరభద్రం

- గత రెండు రోజులుగా ఎడతెరపి లేని వర్షం
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



ఇంటివద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి

ఆలూరు రూరల్: వర్షాకాలం ఎక్కడ చూసినా చిత్తడిగా మారి ఖాళీస్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఏర్పడి మురుగునీటితో కలిసి అపరిశుభ్రత చోటు చేసుకుంటోంది. దీంతో దోమలు వృద్ధి చెందడమే గాకుండా తాగునీరు కూడా కలుషితమయ్యే పరిస్థితులు ఉన్నాయి. వాతావారణంలో మార్పుల కారణంగా దోమలు పెరిగి మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అకాశం ఉంది. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువ. అందుకే ప్రజలు పరిశుభ్రతతో పాటు, సురక్షితమైన నీరు తాగడం, దోమ తెరలు వాడటం, తదితర ముందు జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు దరిచేరవని వైద్యులు సూచిస్తున్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

దోమల వ్యాప్తి కారణంగా మలేరియా, డెంగీ తదితర వ్యాధులు వస్తాయి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంట్లో నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలం ప్రారంభం సమయంలో దోమల గుడ్లు లార్వా దశకు చేరుకోవడం వల్ల సాధారణంగా దోమల ఉధృతి అధికంగా ఉంటుంది. నీరు నిల్వచేసిన డ్రమ్ములు, పాడైపోయిన టైర్లు, పూలకుండీలు, ఇంకుడు గుంతలు, పాడేసిన కొబ్బరి చిప్పలు, రుబ్బురోళ్లు, వాటర్ ట్యాంకులలో దోమల లార్వా అధికంగా వ్యాప్తి చెందుతుంది. దోమలను లార్వా దశలోనే అరికట్టేందుకు ప్రభుత్వ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధానంగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచిస్తోంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజన్‌కు నిమిత్తం లేకుండా ఫ్రైడే–డ్రైడేపై అవగాహన కలిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న యంత్రాంగం

సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో మొలగవల్లి, కమ్మరచేడు, అర్ధగేరి, హొళగుంద, ఆస్పరి, గజ్జహళ్లి తదితర పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ప్రజలను ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వరం లక్షణాలు ఉన్న వారందరి రక్తాన్ని సేకరించి పరీక్షలు చేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ఇంటింటికీ డాక్టర్లు రావడంతో అక్కడిక్కడే రోగులు పరీక్షలు చేయించుకుని మందులు వాడుతున్నారు. జర్వం నిర్ధారణ అయిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు సిబ్బంది ఆరోగ్యం శుభ్రత, పారిశుద్ధ్య పనులపై పంచాయతీ, ఆరోగ్య అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నారు.



డ్రైడే- ఫైడేపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఇంటికే వచ్చి మందులు ఇస్తున్నారు



వారంలో రెండు సార్లు మా గేరికి వచ్చి డాక్టర్లు నీకు సుస్తి అయ్యిందా? అని అడిగి మాత్రలు ఇస్తున్నారు. జ్వరం ఉందా..ఒళ్లు నొప్పులు ఉన్నాయా.. తలనొప్పి ఉందా అని అడిగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్నారు. మా ఇంట్లో పిల్లలకి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. ఇంతకుముందు ఆరోగ్యం బాగాలేకుంటే నడిచి ఆస్పత్రికి పోయే వాళ్లం. ఇప్పుడు ఇంటి కాడికే డాక్టర్లు వస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేదు.

– మారెప్ప, కోయనగర్, ఆలూరు

అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి ఆహారం తీసుకోవాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. రోగ నిరోధక శక్తి పెంచుకోవడం తదితర జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే పాటించాలి. పంచాయతీ అధికారులు వారానికోసారి నీటి ట్యాంకులు శుభ్రం చేయించాలి. నీటి పరీక్షలు చేయించాలి. ప్రజలకు జ్వరాలు ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ వాహిద్, ఆలూరు

మాతాశిశు మరణాలు నివారించండి

మద్దికెర: ప్రమాద సంకేతాలు ఉన్న గర్భవతులకు ఉచితంగా టిఫా స్కానింగ్, అల్ట్రా సోనోగ్రాఫిక్ ద్వారా గర్భంలోని బిడ్డ లోపాలను గుర్తించి మాతాశిశు మరణాలు నివారించాలని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను రకతహీనత, ప్రమాద సంకేతాలున్న గర్భిణుల చికిత్స కోసం వినియోగించుకోవచ్చన్నారు. సెప్టెంబర్ నెలను పోషణ మాసోత్సవాలుగా నిర్వహించి ప్రజల్లో రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటేశులు, సిబ్బంది ప్రకాష్‌రావు, కృష్ణమ్మ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లిగుండ్లలో డెంగీ నిర్ధారణ

గోనెగండ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికకు డెంగీ వ్యాధి నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. దీంతో మంగళవారం వైద్య సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లి బాలిక ఇంటి పరిసరాలను శుభ్రం చేయించారు. అలాగే దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. ఎవరికైనా డెంగీ లక్షణాలు ఉంటే స్థానిక వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సర్వీసులు పెంచాలి



కృష్ణగిరి సచివాలయంలో పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కృష్ణగిరి: గ్రామ సచివాలయాలలో ప్రజలకు అందించే సర్వీసులను పెంచాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం కృష్ణగిరి గ్రామ సచివాలయాన్ని, మండలంలోని మీ–సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సచివాలయ పరిధిలో రోజుకు 20 నుంచి 30 సర్వీసులు జరిగేలా ఉద్యోగులు కృషి చేయాలన్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకుని ప్రభుత్వ సేవలను అందులో అప్‌లోడ్ చేయాలని సూచించారు. యాప్ ద్వారా అర్హులైన వారందరికీ రూ.5 లక్షల బీమా ఉంటుందన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అనంతరం కృష్ణగిరి, ఎరుకలచెర్వు, చిట్యాల తదితర గ్రామాల్లోని మీ–సేవా కేంద్రాలను పరిశీలించారు. ఆయా సర్వీసులను నిర్దేశించిన మొత్తం కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటరు జాబితాలో పొరపాట్లకు తావివ్వొద్దు



తహసీల్దార్లతో సమావేశమైన డిప్యూటీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున

ఆలూరు: నియోజకవర్గంలో ఓటరు జాబితా, చేర్పులు, మార్పులు సవరణ ప్రక్రియను తహసీల్దార్లు, డీటీలు, బీఎల్‌ఓలు పకడ్బందీగా అమలు చేయాలని డిప్యూటీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆలూరు తహసీల్దార్ రామాంజనేయులు సమక్షంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన తహసీల్దార్లు, డీటీలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 226 పోలింగ్ బూత్‌లలో 2,24,567 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 7,890 మంది మృతుల ఓట్లను జాబితా నుంచి తొలగించినట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. తహసీల్దార్లు రామాంజనేయులు, స్వామి, కుమారస్వామి, వెంకటేష్‌నాయక్, లక్ష్మీనారాయణ, ఉసేన్, డీటీ గుండాలనాయక్, విజయ్‌కుమార్, బసన్నగౌడు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శుద్ధమైన నీటిని సరఫరా చేయండి



బాపురం పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మురళీధర్‌రావు

ఆలూరు: ఎస్‌ఎస్ ట్యాంకుల నుంచి శుద్ధి చేసిన నీటినే గ్రామాలకు సరఫరా చేయాలని ఆదోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మురళీధర్‌రావు ఆలూరు సబ్‌డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, జేఈలను ఆదేశించారు. ఆయన మంగళవారం హాలహర్వి మండలం బాపురం, గూళ్యం, ఆలూరు గ్రామాల్లోని ఎస్‌ఎస్ ట్యాంకులు, ఓహెచ్‌ఆర్, నీటి శుద్ధి (పరీక్ష) ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ, జేఈలతో ఆయన సమావేశమయ్యారు. ఫిల్టర్ బెడ్లు, గ్యాస్, బ్లీచింగ్ పౌడర్‌తో శుద్ధి చేసిన తర్వాతే ఓహెచ్‌ఎస్‌ఆర్‌లకు నీటిని పంపింగ్ చేయాలన్నారు. గత వారం ఎల్లెల్సీ కాలువ వద్ద మోటార్లు మరమ్మతులకు గురికావడంతో ట్యాంకుల నీటిని పంపింగ్ చేయడంలో జాప్యం జరిగిందన్నారు. జగనన్న కాలనీల్లో 190 పనులు చేపట్టేందుకు రూ 73.50 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. 139 పనులకు టెండర్లు పూర్తయ్యాయన్నారు. జలజీవన్ మిషన్ పథకంతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. డీఈ మల్లికార్జునయ్య, జేఈ మోహన్‌బాబు తదితరులు ఉన్నారు.

హొళగుందలో 37.4 ఎంఎం వర్షం



హొళగుందలో వర్షం కురుస్తున్న దృశ్యం

హొళగుంద: మండలంలో రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం 37.4 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇన్నాళ్లు వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు వాడుముఖం పట్టిన సమయంలో వర్షం కురవడంతో పైర్లకు కొద్దిమేర జీవం పోసినట్లయ్యింది. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులు పొలాల్లో పత్తి, వేరుశనగ, మిరప, వరి తదితర పంటల సాగు చేశారు. అయితే పంట పెరుగుదల దశలో వరుణుడు మొహం చాటేశాడు. దీంతో వర్షం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో రెండు రోజులుగా అడప దడప కురిసిన చినుకులు ఉపశమనం కలిగించాయి. పంటలు వాడుతున్న తరుణంలో వరుణుడు కరుణించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భజన బృందాలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న పక్కీరప్పతాత శిష్యుడు కోదండరామస్వామి

పత్తికొండ రూరల్: పత్తికొండలో అవధూత పక్కీరప్ప తాత 39వ ఆరాధానోత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి భజన పోటీల్లో విజేతలకు పక్కీరప్ప తాత శిష్యుడు కోదండ రామస్వామి చేతుల మీదుగా మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.15 వేలు పామిడి దత్తాత్రేయ గ్రూప్, రెండో బహుమతి రూ.12 వేలు దుగ్గిమర్రి పెద్దమ్మ తల్లి భజన మండలి, మూడో బహుమతి రూ.10 వేలు శివ, రామాంజనేయులు బృందం గెలుచుకున్నారు. మిగతా ఆరు బృందాలకు వరుసగా బహుమతులు అందజేశారు. సేవాసమితి సభ్యులు మహేష్, మల్లికార్జున, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్దికెరకు ఎమ్మెల్యే రాక

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరకు ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధరరెడ్డి మంగళవారం తెలిపారు. మద్దికెరలోని జగనన్న కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించబోయే ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు

మద్దికెర: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి రవి మంగళవారం తెలిపారు. 36.5 టన్నుల డీఏపీ, 11 టన్నుల 14:35:14, అలాగు 26.5 టన్నుల 20:20:0:13, 21 టన్నులు 28:28:0 ఎరువులు ఉన్నాయన్నారు. ఎరువులు కావలసిన రైతులు ఆయా కేంద్రాలలోని వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఎమ్మిగనూరుటౌన్: తిరుపతిలో ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక తరగతులను నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ నాయుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవతం చేయాలని కోరారు.

బీమా తక్షణ సాయం అందజేత

దేవనకొండ: మండలంలోని నల్లచెలిమల గ్రామానికి చెందిన వడ్డె సూరి మృతిచెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు మంజూరైంది. ఈ మేరకు మృతుడి భార్య సుజాతకు ఆ నగదును వైస్ ఎంపీపీ అశోక్‌కుమార్ మంగళవారం అందజేశారు. మిగతా డబ్బు 15 రోజుల్లో నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతుందన్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

నివాళి

ఎమ్మిగనూరుటౌన్: కనకవీడు గ్రామవాసి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంతరెడ్డి సతీమణి ప్రమీలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో మంగళవారం వారి నివాసంలో ఆమె భౌతిక కాయానికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు కేఆర్ లక్ష్మీకాంత రెడ్డి, విరూపాక్షి రెడ్డి తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

సిద్ధమవుతున్న గణేష్ ప్రతిమలు

మద్దికెర: ఈనెల 18 వతేదీన వినాయకచవితి పండుగ పురస్కరించుకొని వినాయకుల ప్రతిమలను వ్యాపారులు సిద్ధం చేస్తున్నారు. మండపాల్లో కొలువుంచేందుకు పెద్దలు, పిల్లలు ఉత్సాహంగా వినాయక విగ్రహాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ఏడాది మొత్తం వినాయక విగ్రహాలను తయారు చేస్తామని ఒక్కో విగ్రహం రూ. 5 వేల నుంచి రూ.10 వేలు ఉంటుందని వ్యాపారులు పేర్కొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ-2 ఎర్ర నాగప్ప

తుగ్గలి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని వైస్ ఎంపీపీ–2 ఎర్ర నాగప్ప అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ఆదెమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు సరిగా హాజరు కావడం లేదని, సమస్యలు ఎలా చెప్పుకోవాలని వైస్ ఎంపీపీ నాగప్ప వాపోయారు. అధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని కోరారు. పొదుపు సంఘాల సభ్యులు చెల్లించిన డబ్బులు స్వాహా చేసిన వీఓఏపై చర్యలు తీసుకోవాలని ఉప్పర్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు రామదాసునాయక్ కోరారు. చెల్లించిన రసీదులతో సభ్యులు వస్తే వీఓఏపై కేసు పెడతామని ఏపీఎం రాధాకృష్ణ చెప్పారు. కొన్ని నెలలుగా గ్రామంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని రాతన సర్పంచ్ రాచప్ప అధికారుల దృష్టికి తెచ్చారు. పత్తికొండ నుంచి తుగ్గలి, పెరవలి మీదుగా గుంతకల్లుకు ఆర్టీసీ బస్సు నడిపేలా తీర్మానం పంపాలని ఆయన కోరారు. అనంతరం పోషణ మహా పోస్టర్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్రమ్మ ఆవిష్కరించారు. పోషకాహారంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎంపీడీఓ సావిత్రి, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య

నందవరం: కర్ణాటక మద్యం అక్రమంగా తరలి స్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. మండల పరిధిలోని గంగవరం గ్రామం ఊరి బయట తుంగభద్ర నది ఒడ్డున బ్యాగ్‌లో అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకెళ్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. మద్యం తరలిస్తున్న కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా, గుండ్రేవుల గ్రామానికి చెందిన మాల శివశంకర్‌ను పట్టుకొని జాన్స్ ఒరి నల్ ఛాయస్ విస్కీ 768 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడి ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కొనసాగుతున్న వైద్యశిబిరం



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో అతిసార వ్యాధి అదుపులోకి వచ్చిందని వైద్యాధికారులు తెలిపారు. సోమవారం నుంచి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. మంగళవారం వైద్య శిబిరాన్ని ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై మండల డాక్టర్ మన్సూర్‌వలిని అడిగి తెలుసుకున్నారు. అతిసారా అదుపులోకి వచ్చిందని, ప్రజల ఆరోగ్యానికి డోకా లేదన్నారు. నీటి శాంపుల్స్‌ను ల్యాబ్‌కు పంపడం జరిగిందన్నారు. ల్యాబ్ రిపోర్టు వచ్చేంత వరకు వైద్య శిబిరం కొనసాగిస్తామన్నారు. గ్రామంలో నీటిని క్లోరినేషన్ చేయించేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, పంచాయతీ అధికారులతో కలిసి శానిటేషన్ పనులు చేపడుతున్నట్లు ఆమెకు వైద్యాధికారి తెలియజేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సూపర్‌వైజర్‌లు ఆదినారాయణ, అబ్రహం, జిల్లా అధికారులు చలపతి, మోక్షేశ్వరుడు ఉన్నారు.

రాత్రి వేళలోనూ ఎరువుల పంపిణీ



చిన్నహ్యాట రైతు భరోసా కేంద్రంలో ఎరువులు పంపిణీ చేస్తున్న వీఏఏ తస్లీమా

హొళగుంద: చిన్నహ్యాట రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రాత్రి వీఏఏ తస్లిమా రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తుండడంతో పొలాల్లో వేసేందుకు రైతులు ఎరువుల కోసం ఆర్బీకేకు వస్తున్నారు. దీంతో తస్లిమా ఆర్బీకే దగ్గరే ఉంటూ ఎరువుల కోసం వచ్చిన రైతులకు స్టాకు వచ్చిన వెంటనే పంపిణీ చేశారు. కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్న రైతులకు ఎమ్మార్పీ ధరకే ఎరువులు అందజేస్తున్నట్లు వీఏఏ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా, డీఏపీ, 20:20:0, కాంప్లెక్స్ ఎరువులు ఆర్బీకేకు వచ్చాయని మంగళవారం 600 బస్తాలు అందజేసినట్లు వెల్లడించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఎమ్మిగనూరులో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఎంఎస్ ఉపాధ్యాయులు



నాగలదిన్నెలో ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు



పత్తికొండలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు



ఉపాధ్యాయుడు నాగన్నను సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా పాఠశాలల్లో రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడిగా వృత్తి చేపట్టి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని ఆయా పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు

పత్తికొండ రూరల్: స్థానిక పాతపేట ఉర్దూ పాఠశాలలో భారతి సిమెంట్ డీలర్ ఇబ్రహీం 25 మంది ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ మస్తాన్‌వలి హాజరయ్యారు.